క్లుప్తంగా

కండలేరులో 6.909 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.909 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే సత్యసాయిగంగ కాలువకు 250, పిన్నేరువాగుకు 25, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాఘవరెడ్డి సేవలు ప్రశంసనీయం



రాఘవరెడ్డిని సన్మానిస్తున్న డీఎం అనీల్‌కుమార్, అధికారులు

రాపూరు: రాపూరు ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పని చేస్తున్న రాఘవరెడ్డి సేవలు ప్రశంసనీయమని డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. కోటంరెడ్డి రాఘవరెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను డిపోలోని నాయకులు, కార్మికులు, అధికారులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 36 సంవత్సరాలు ఆర్టీసీకి సేవలు అందించారని కొనియాడారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



చంద్రశేఖర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

నాయుడుపేట టౌన్ : ఎవరైనా విధుల్లో అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని విశ్రాంత ఎంఈవో నల్లమాకల శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అన్నమేడు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ టీచర్ నానబాల చంద్రశేఖర్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు హెచ్‌ఎం మధుసూదన్‌రావు అధ్యక్షతన సన్మానం చేశారు. విశ్రాంత హెచ్‌ఎంలు పద్మనాభయ్య, పేర్నాటి వెంకటేశ్వర్లు, న్యాయవాది చదలవాడ కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశా రని తెలిపారు. అనంతరం చంద్రశేఖర్, వెంకటరమణమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. నాయకులు గంధవళ్లి సిద్ధయ్య, కేఎంవీ కళాచంద్ర, అన్నమేడు సర్పంచ్ కే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ మునిలక్ష్మిని సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన మునిలక్ష్మిని రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. ఆమె రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను కొనియాడారు. ఆమె శేష జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, ఈ డీటీ యువరాజ్, రెవెన్యూ కారాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సైదాపురం: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వంకలు, వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ క్రాంతికుమార్ కోరారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే సైదాపురం వద్ద కైవల్యా నది, ఊటుకూరు వద్ద మాలేరు, తురిమెర్ల వద్ద ఉన్న పిన్నేరు వాగు వద్ద కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

నారాయణలో ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న ఈఎస్‌ఐ వైద్య సిబ్బంది

గూడూరు రూరల్ : గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఈఎస్‌ఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బంది 250 మందికి ఈఎస్‌ఐ ద్వారా వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయకుమారి, విశ్వక్సేన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కోటేశ్వరరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: విగ్రహాలకు రంగులు అద్దుతున్న మహిళ, వెంకటగిరి: విభిన్న ఆకారాల్లో ఉన్న గణేష్ విగ్రహాలు, సూళ్లూరుపేట: నెమలి వాహనంపై విఘ్నేశ్వరుడు







గణనాథా.. నీ ప్రతిమ కోసం...

- విభిన్న రూపాల్లో గణేష్ విగ్రహాలు
- గణనాథుని ప్రతిమలకు పెరుగుతున్న ఆర్డర్లు
- ముమ్మరంగా గణేష్ విగ్రహాల తయారీ





సూళ్లూరుపేట: విగ్రహాలను చూస్తున్న కొనుగోలుదారులు, నాయుడుపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

వెంకటగిరి రూరల్/సూళ్లూరుపేట రూరల్: వినాయక చవితి పండుగకు వెంకటగిరిలో గణేశుడి ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. రాజస్తాన్ నుండి కొన్ని కుటుంబాలు వెంకటగిరికి చేరుకుని గత రెండు నెలల ముందునుండి విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యాయి. పట్టణంలోని 6 ప్రాంతాల్లో విగ్రహాల తయారీ, గణేష్ టీషర్ట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. కస్టమర్ల ఆర్డర్లపై అడ్వాన్సు బుకింగ్‌లతో బిజీ అయిపోతున్నారు. వెంకటగిరి పట్టణంతోపాటు, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల నుంచి గణేష్ విగ్రహాలను కొనుగోలు చేస్తారు. పట్టణంలోని పాలకేంద్రం సబ్‌స్టేషన్ పక్కన, కుమ్మరిగుంట సాయిబాబా దేవస్థానం ముందు, రాపూరు రోడ్డు గోడవున్ క్రాస్‌రోడ్డు వద్ద ఇలా సుమారుగా 6 దుకాణాలను ఏర్పాటు చేశారు. స్వంతంగా వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. 5 అడుగుల నుండి 12 అడుగుల వరకు విగ్రహాలను తరు చేయడంతోపాటు కస్టమర్లు కోరుకున్న డిజైన్‌లతో విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట జాతీయ రహదారిపై వినాయక చవితికి గణనాథుడి విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. పండుగ దగ్గర పడుతుండంతో ఇప్పటికే తయారు చేసిన విగ్రహాలకు పెయింటింగ్‌తోపాటు తుదిమెరుగులు దిద్దే పనులలో కార్మికులు నిమగ్నమయ్యారు. ఈ సారి జాతీయ రహదారిపై తమిళనాడు, రాజస్తాన్ నుంచి వచ్చిన కార్మికులు వివిధ రూపాల్లో కళానైపుణ్యం ఉట్టి పడేలా వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీణ, సరస్వతి, మూషికం, పల్లకీ , నెమలి సింహాసనం గణపతితో పాటు దేవుళ్ల రూపాలు శివపార్వతి, రాముడు, వెంకటేశ్వరుడు రూపాల్లో భక్తులను ఆకట్టుకునేవిధంగా విగ్రహాలను తీర్చిదిద్దారు. రూ.15వేల నుంచి రూ.60 వేల వరకు వినాయక విగ్రహాల ధరలు పలుకుతున్నాయి. ఇప్పటికే తయారీ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల సందడి మొదలైంది.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : వినాయక చవితి పండుగ సమయంలో దగ్గర పడుతుండడంతో నాయుడుపేటలోని వినాయకుని విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. నాయుడుపేటలో ఎనిమిదికిపైగా విగ్రహాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన వారే కాకుండా స్థానికులు కూడా విగ్రహాలు తయారు చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్లాస్టర్ ఆఫ్ ఫారిస్‌తో కాకుండా ఆర్లగడ్డ పిండి, మట్టి, చాక్ పౌడర్‌తో వినాయకుడి విగ్రహాలు చేస్తున్నారు. దీంతో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచే కాకుండా తమిళనాడుకు చెందిన అనేక మంది ముందుగా అడ్వాన్సులు ఇచ్చి విగ్రహాలు ఆర్డర్ ఇస్తున్నారు. తుమ్మూరులో నాగరాజు అనే వ్యక్తి నీటిలో కరిగిపోయే విగ్రహాలను మాత్రమే తయారు చేస్తున్నాడు. అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షానికి విగ్రహాలు దెబ్బతినకుండా చూడడం కష్టంగా ఉందని వాపోతున్నాడు.

నీటిలో కరిగే విగ్రహాలు చేస్తున్నాం



పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాం. ఆర్ల గడ్డపిండి, గోచు తదితరాలతో విగ్రహాలను తయారుచేస్తున్నాం. ప్రస్తుతం విగ్రహాలకు డిమాండ్ ఉన్నప్పటికీ ముడిసరుకుల ధరలు పెరుగుతుండడంతో లాభాలు రావడం లేదు. ముందుగా ఆర్డర్ ఇస్తే భారీ విగ్రహాలను సైతం తయారు చేస్తున్నాం. – ఇలూపూరు నాగరాజు, తుమ్మూరు

ముందుగానే ఆర్డర్లు ఇస్తున్నారు



చాక్ పౌడర్‌తోపాటు మరికొన్ని వస్తువులను కలిపి చేస్తున్న వినాయక విగ్రహాలు నీటిలో త్వరగా కరిగిపోతాయి. విగ్రహాల ఫొటోలను ఆన్‌లైన్‌లో పెడుతుండడంతో తమిళనాడు, తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల వారు నాయుడుపేటకు వచ్చి ఆర్డర్లు ఇస్తున్నారు. రెండేళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్నాం. – నెమలి హేమంత్, విగ్రహాల తయారీదారు, నాయుడుపేట

రోజురోజుకు ధరలు పెరిగిపోతున్నాయి



విగ్రహాలకు డిమాండ్ ఉన్నప్పటికీ ముడిసరుకుల ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండడంతో లాభాలు రావడం లేదు. మేము పదేళ్ల క్రితం రాజస్థాన్ ప్రాంతం నుంచి నాయుడుపేటకు వచ్చి భారీ విగ్రహాలను తయారు చేస్తున్నాం. కొంతమంది ఆతృతతో విజయవాడ, హైదారాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. – పప్పురామ్, రాజస్థాన్ వాసి, నాయుడుపేట

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

చిల్లకూరు: రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రామారెడ్డిపాళెం గిరిజన కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను కించి పరిచే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. న్యాయం కోసం నేరుగా కోర్టులో పిటీషన్లు వేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి విజయమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొనారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దక్కిలి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈవో–2 పి.జగదీష్ తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం కందలవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లే ఆధారమన్నారు. భావి తరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులను ప్రశ్నించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరళకుమారి, ఉపాధ్యాయురాలు రత్నప్రభ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

వెంకటగిరి రూరల్/సైదాపురం/పెళ్లకూరు : వెంకటగిరి పట్టణంలోని 3వ వార్డులో లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దే పింఛను మొత్తం అందజేస్తామని, అధైర్యపడొద్దని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, స్థానిక కౌన్సిలర్ ప్రభావతి పాల్గొన్నారు. అదేవిధంగా సైదాపురం మండలంలో సచివాలయ సిబ్బంది పింఛను అందజేశారు. పోతేగుంట పంచాయతీలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ నగదు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కట్టా మోహన్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెళ్లకూరు మండలం దిగువ చావలిలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ ధనలక్ష్మీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూదూరు భూసమస్యపై రెవెన్యూ కోర్టు



ఇరువర్గాలను విచారిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం : మండలంలోని బూదూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పడిన భూసమస్యపై శనివారం తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ కోర్టు నిర్వహించి ఇరువర్గాలను విచారించారు. బూదూరు గ్రామానికి చెందిన ఎన్ సుబ్బరత్నమ్మ, కుర్ర సుబ్రమణ్యంరెడ్డికి చెందిన భూముల వివాదంపై బాధితులతో పాటు జీపీ తీసుకుని బయట ప్రాంతం వారికి విక్రయించిన స్థానిక టీడీపీ నాయకుడు, రియల్టర్ గుత్తా రవీంద్రనాయుడిని విచారించారు. రైతులు తాము తమ భూమిని ఎవరికీ విక్రయించలేదని తెలిపారు. తాను లక్షలు వెచ్చించి రైతుల భూములు కొనుగోలు చేసినట్టు రియల్టర్ చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎవరు సాగులో ఉన్నారనే విషయంపై విచారించి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ గోపీనాథ్‌రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, వీఆర్వో మురళి పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం జరిగేనా...?

తమకు న్యాయం ఎప్పటికి జరుగుతుందోనని బాధిత రైతులు వాపోయారు. గ్రామంలో ఈ భూసమస్య ఏర్పడి ఐదేళ్లకు పైగా అయిందని, నాటి నుంచి కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ పేరుతో తహీసల్దార్ కార్యాలయంలో ఇప్పటికే మూడుసార్లు రెవెన్యూ కోర్టు నిర్వహించారని, ఇంకా 15 మందికి పైగా బాధిత రైతులను విచారించాల్సి ఉందని చెప్పారు.

రూ.143 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట నియోజవర్గంలో పంట పొలాలు, శ్మశనవాటికల వద్ద అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.143 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శనివారం నాయుడుపేట పట్టణం ఎల్‌ఏ సాగరం అగ్రహారపేట, అమరాగార్డెన్ ప్రాంతాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అందరితో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ చైర్ పర్సన్ మైలారి శోభారాణి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, కౌన్సిలర్ దారా రవి, నాయకులు ఎస్ విజయభాస్కర్ రెడ్డి, ఎన్ రాజేష్, మైలారి రాజశేఖర్, అత్తికాయల సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

చిల్లకూరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని కలవకొండ గ్రామంలో శనివారం రక్త దాన శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 40 మంది రక్తం దానం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక సారి రక్త దానం చేయవచ్చన్నారు. జనసేవ నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి రక్త దానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కే మోహన్, సునీల్, కార్తీక్, నాగార్జున, సాయి, దారా కుమార్, కల్లూరు సుబ్రమణ్యం, మహేస్, పాలేటి మధు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న వేద పండితులు

వాకాడు : మండలంలోని చీమలపాడు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు విశేష అభిషేకాలు, ప్రత్యేక హోమాలు, కుంకుమ పూజలు చేశారు. గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ప్రధాన అర్చకుడు పవన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవలు లక్ష్మీనరసింహ స్వామి వారు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ యరటపల్లి సాయి పృథ్వీరెడ్డి, శరణ్‌కుమార్ తనయుడు హృతిక్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. సాయంత్రం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీపై ఉంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలను ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

బాలాయపల్లి(సైదాపురం) : మండలంలోని వెంగమాంబపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష కోసం ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలాయపల్లి ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి ఎస్‌ఐగా కామినేని గోపి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని కోరారు.



ఎస్‌ఐ గోపి →

దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం

– కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న చింతామోహన్

గూడూరు రూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. ఆయన శనివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ముంబయి స్టాక్ ఎక్స్ఛేంజ్ కేంద్రంగా బీజేపీ రూ.2 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రధాని మోదీ స్నేహితుడైన అదానీ దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలు ఇచ్చారని, ఇప్పటి వరకు ఒక దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పేరుతో ప్రభుత్వం పేదలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో శ్రీసిటీలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసిన విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. టీటీడీలో వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో గూడూరు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామక్రిష్ణారావు, దర్శి నాగభూషణం, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- బిల్లుల మంజూరు చేయలేదని చైర్మన్‌పై వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ఆగ్రహం
- మున్సిపల్ జమా ఖర్చుల వివరాలు తెలపాలని డిమాండ్



చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్ పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. పోలేరమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని 25 వార్డుల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల బీపీఎస్ నిధులతో అభివృద్ధి పనులతోపాటు 17 అంశాలతో కూడిన అజెండాకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. తమ వార్డుల్లో సమస్యల పరిష్కారంతోపాటు చేసిన పనులకు బిల్లుల మంజూరు చేయకపోవడం వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, 14వ వార్డు కౌన్సిలర్ అరి శంకరయ్య మండిపడ్డారు. వెంకటగిరి మున్సిపాలిటీ ఆవిర్భావంలో అప్పటి చైర్మన్ అల్లం చంద్రమోహన్‌తో కలిసి పనిచేశామని, ఆ సమయంలో వార్డుల్లో ఏ పనిచేసినా కౌన్సిలర్ల సూచనలు, సలహాలు తీసుకునే వారని తెలిపారు. ప్రస్తుతం సమాచారం లేకుండానే ఇష్టమొచ్చినట్టు అజెండాను సిద్ధం చేయడం సమంజసం కాదన్నారు. పాలకవర్గంలో జమా ఖర్చుల వివరాలు తెలియజేయాలని పలువురు కౌన్సిలర్లు అధికారులను కోరారు. 21వ వార్డు కౌన్సిలర్ జి ఢిల్లీబాబు మాట్లాడుతూ మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీల కారణంగా సక్రమంగా నీరు సరఫరా కావడంలేదని ఆరోపించారు. పోలేరమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. 5వ వార్డు కౌన్సిలర్ నారిశేఖర్ మాట్లాడుతూ భ్రమరాంబ థియేటల్ వద్ద పోలేరమ్మ ఆలయ స్థలం 11 సెంట్లకు సచివాలయం అధికారులు పన్ను విధించారని తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పనుల్లో భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను సంప్రదాయ బద్ధంగా నిర్వహించేందుకు రూ.కోటి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అబ్దుల్‌రషీద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. 6 గంటలకు గోపూజ, పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ



గూడూరు రూరల్ : గూడూరు పట్టణం ఎల్‌ఐసీ ఆఫీస్ వద్ద శనివారం ఒక లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో సుమారు అర గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలిసినా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి జాతీయ రహదారి వరకు వన్‌వే ట్రాఫిక్ ఉంది. ఈ రోడ్డులో పెద్ద వాహనాలు వచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. వాహన చోదకులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలోనే సీఆర్‌రెడ్డి కల్యాణ మండపం సమీపంలో పెద్ద లారీ ఇరుక్కుపోవడంతో గూడూరు నుంచి వెళ్లే వాహనాలకు దారి లేక ట్రాఫిక్ నిలిచి పోయింది.